


# ఆరాధన

శ్రీ కిళాంబి కృష్ణమాచార్య.

([illegible] 4ని. 10నం.)

అప్పటి కప్పుడే నక్షత్ర దీపికలు తమ కాంతులను రవి కర్పణమొనరించి సాగిపోతున్నాయి. పక్షిగములెల్ల వడివడిగా లేచి భానుని కీర్తించి పాడుచున్నవి. బాలభానుడు తన లేత కిరణములచే లోకాన్ని మేల్కొలుపుచున్నాడు. ప్రకృతి నూతనోత్సాహముతో నలరారుచున్నది. చల్లటి పిల్లవాయువులు మందగతిని వీస్తున్నాయి.

నేనూ మా రాజూ సెలయేటి నడకను గమనిస్తూ నడిచిపోతున్నాం. ప్రక్కనే ఉన్న పుష్పవనము నుండి సౌరభములు వెదజల్ల బడుచున్నవి. పూదీగలు గాలికి అల్లలాడుచు మమ్ములను తొంగిచూస్తున్నాయి. తోటమధ్య నొక శిలాప్రతిమ. ఒక యువకుడు ప్రతిమ ముందు నిలిచి దానిని పూలతో అలంకరింపచేస్తూ మాటిమాటికి సరిచేస్తున్నాడు. వివిధ పుష్పములచే అమర్పబడిన మాలను తుదకు ఆ ప్రతిమపై వేసి, దానివంక దీర్ఘంగా చూస్తున్నాడు. మేము సమీపమునుండి ఆ యువకుని పరికించ సాగాం. అతడు కరుణామూర్తి వలె కన్పడ్డాడు. ఒక్క వేడి నిట్టూర్పు విడిచి విషాదంగా నడిచి వెళ్ళిపోయాడు ఆ యువకుడు.

"అతని చర్య చాల విపరీతముగా నున్నది సుమా" అని మెల్లిగా రాజువంక చూచాను.

అతడు కన్నీరు విడుస్తూ "అది యొక విషాదగాథ. ఆమె అతన్ని జీవితాంతము వరకు గాఢముగా ప్రేమించింది. కాని అత డామె నంతగా ప్రేమించలేక పోయినాడు. ఆమె కోమలమగు మనస్సు ఈ చర్యను భరించలేక పోయినది. నిర్మల ప్రేమ పీఠమునందు తన జీవితమును ఆహుతి గావించినది. పురుషులకంటే స్త్రీలే ప్రేమ వాహినియందు ఐక్యము కాగలరని లోకానికి

ని దర్శనము చూపినది. శిల్పకారుడు పశ్చాత్తాపము చెందాడు. బహు ప్రయాసపడి ఆమె శిలావిగ్రహాన్ని తయారుచేసాడు. దాని నొక రమణీయమగు ఉద్యాన వనమునందు అధిష్ఠింప చేసాడు. తోటయందలి పూలతో రోజూ మాలను తయారుచేసి, ఆరాధన చేస్తుంటాడు" అని అతని జీవితచర్యను చెప్పసాగాడు మారాజు.

* * *

"ఆపిల్ల రోజూ పూలమాలలన్నీ అమ్మి తిరిగి ఇంటికి వచ్చుసరికి సాయంకాల మయ్యేది. వాన జోరున కురియుచున్నను, వడగాడ్పులు తీవ్రంగా వీస్తున్నను ఆమె బయలుదేరుట మానేదిగాదు. వచ్చిన ఏ బేడా డబ్బులతోటో ముసలి తల్లి, తను జీవనము గడుపుచుండే వాళ్లు. ఏరోజున మాలలు అమ్మకము కాకపోతే, ఆ రోజున పస్తుండవలసినదే. అక్కడక్కడ పూలను ఏరు కొనివచ్చి ముసలి తల్లి మాలలుగా కట్టేది. చద్దితిని బయలుదేరి మాలలను అమ్ముకొనివచ్చుట ఆపిల్లవంతు. సాయంకాలము తల్లి ఎదురుగావచ్చి పిల్లలను ప్రేమతో లోపలికి తిసుకొని వెళ్ళేది. ఏ నాడైనా కొంచెము ఆలస్యముగావస్తే తల్లి ప్రాణము గిలగిలా కొట్టుకు పోయేది. ఇంటికి రావడముతోటే ఉడుకునీళ్లు పోసి గారాబముగా ప్రక్కలో పడుకో బెట్టుకునేది.

* * *

"ఎందుకబ్బాయీ ఏడుస్తున్నావ"ంది దారిలో ఏడుస్తున్న కుర్రాణ్ణిచూచి.

"నా రెండు కానీలు పోయినాయి"అని ఆపీలికలు ధరించిన బాలిక వైపు దీనంగా చూచాడు.

ఆ పిల్ల హృదయము కరుణతో నిండిపోయినది.

"ఇవిగో"అని రెండు కానులు అతని చేతి కందించింది.

ఈ లోకమునందు తన మాతృదేవిని తప్ప ఇంకెవరిని ప్రేమించి ఎరుగదు. గాలికి అల్లలాడుచు అతని ముఖమును గప్పివేయుచున్న ముంగురులు, ఆ ముద్దు ముఖ మండలి కోమలత్వము ఆమె హృదయాన్ని ఆకర్షింప జేసాయి. ఒక్కమారు తన చిరిగిన పరికిణీ, దువ్వకుండా వదలివేసిన శిరోజములు జ్ఞప్తికొచ్చాయి. ఏదో తప్పుచేసినట్లు రెండడుగులు వెనక్కి వేసి అతని వంక చూస్తూ పరుగెత్తి పోయింది. అతని పిలుపువిన్నది. కాని దూరంగాచూస్తూ నిలబడింది. ఆ కుర్రాడు మళ్ళా పిలిచాడు. ఈ తడవ నవ్వుతో దగ్గరకు వచ్చింది. ఇద్దరు స్నేహితు లయినారు. ఇద్దరూ కాసేపు ఆడుకున్నారు ధనవంతులు ధనహీనులకు గల కృత్రిమ తారతమ్యము వారలను బాధించలేక పోయింది.

"వీటితో క్రొత్త పరికిణీ కుట్టించుకో" అన్నాడు నవ్వుతూ.

"నాకువద్దు" అని కిలకిల నవ్వసాగింది. అతడూ నవ్వాడు.

"నీ కెన్నేండ్లు" అని ఆమెవంక చూచాడు.

"నీకో"

"నాకు పది; మరి నీకో"

"నాకూ అంతే"

"రోజూ నాతో ఆడుకొనుటకు రావూ"

"ఊ......"అని అతని ముంగురులను పైకి త్రోసింది. అతని చెంపలను తన చేతులలోకి తీసుకున్నది. ఆమెవైపు కోపంగా తీక్ష్ణమైన దృక్కులు ప్రసరింప చేసాడు.

"మా అమ్మతో చెప్పనా?"

"వద్దు. అల్లా చేయనుగా" అని అతని వంక చూచింది. ఇద్దరికి నవ్వు వచ్చింది.

"చీకటి పడుతోంది; నే పోతాను." అని లేవ బోయింది.

"మీ యిల్లు దూరమా. నేను రానా."

"వద్దు. నాలుగు మైళ్ళుంది."

"రేపుకూడ ఆడుకొనుటకు వస్తావుగదూ." ఆమె మాటిమాటికి వెనుకకు చూచుకుంటూ గృహాభిముఖయయింది. అతడూ ఆమె అదృశ్యమగువరకు చూస్తూ అక్కడే నిలబడి పోయాడు.

* * * *

"ఏమే అమ్మా, యింత ఆలస్యంగా వచ్చావు" అన్నదిముదుసలి తల్లి ఆదరణతోటి.

"మాలలు త్వరగా అమ్ముడు పోలేదు. నాకో స్నేహితుడు దొరికాడే. అతనితో ఆడుకుంటూ కూర్చు

న్నాను. మంచి బట్టలేసుకున్నాడు. చాల మంచి వాడమ్మా" అన్నది అమాయకంగా.

"ఆ కుర్రాడు గొప్పవాళ్ళ పిల్లవాడేమో. అతనితో నీవు ఆడుకొనగూడదు. నీవు బీదపిల్లవిగదూ. వాళ్ళ అమ్మ చూస్తే నిన్ను ఆడుకొననీయదు."

"మనము ఎందుకు బీదవాళ్ళ మమ్మా. అయ్య లేడనా?" తల్లి కన్నీరు విడుస్తూ పిల్లను దగ్గరకు తీసుకున్నది.

"ఆ పిల్లవాడు మంచివాడమ్మా" అని తల్లితో మాటలు చెబుతూ నిద్రపోయింది.

*　　　*　　　*

ఆ పిల్ల మాలలు తీసుకొని వెళ్ళుతూ, అతడు బడికివెళ్ళే దారిలో కలసికొనేది.

"ఏం అబ్బాయీ" అని పలుకరించేది చిరునవ్వుతో.

"ఏం అమ్మాయీ" అనేవాడు బిగ్గరగా నవ్వుతూ.

"మాల కావాలా."

"ఊ..."అనేవాడు.

ఉన్న మాలలో మంచిది ఏరి అతని మెడలో వేసేది. సంతోషంతో పరుగెత్తి పోతుండేవాడు.

రోజూ సాయంకాలము మాల లమ్ముకొని అతడు బడినుంచి తిరిగివచ్చే వేళకు కలుసుకొనేది. ఇద్దరూ కాసేపు ఆడుకునేవాళ్లు. ఇల్లా కొన్నేండ్లు గడిచాయి. అతడు కనుపడకపోతే పిచ్చిపట్టినట్లు తిరిగేది. కొంచె మాలస్యమయితే అతడూ ఆమెకొరకు తహతహ లాడిపోయేవాడు.

*　　　*　　　*

"అతడిప్పుడు కనుపడుట మానేశాడు. కాని పాపం మాలలు పట్టుకొని రోజూ ఆమె ఆ యింటివైపు వెడుతూండేది. తాను చిన్ననాడు అతనితో ఆడిన స్థలములందు కాసేపు విశ్రమించి మరల బయలుదేరి పోయేది. కొన్ని దినములకు ముదుసలితల్లి ఈలోకము విడిచిపెట్టింది. అందువలన తానే స్వయముగా మాలలు గ్రుచ్చి అమ్మటకు తీసుకువెళ్ళుచుండెడిది. తాను తయారుచేసిన మాలచే అతన్ని అలంకరించుటకు మనసు ఉవ్విళ్ళూరి పోయింది.

"ఆ దినముకూడ మాలలు పట్టుకొని బయలుదేరింది. ఆలోచనా నిమగ్నుడై యున్న యువకునొకనిని చూచింది. పరిచితునివలె కన్పడ్డాడు. చాలసేపు ఆలోచించింది. తన చిన్ననాటి స్నేహితుడేనని గుర్తించింది. సంతోషాంబుధిలో వోలలాడి పోయినది. "అతడే,... అతడే"...అని మాటిమాటికి తలిచింది. కాని అతడు గుర్తుపట్టినట్లు లేదు. పలుకరించ బోయినది. కాని అతడు గుర్తించనిచో...

"కన్నుల వెంట నీరు గిర్రున తిరిగాయి. పైట చెంగుతో తుడుచుకుంటూ మరలిపోయినది. ఆరోజు మాలలేవియు అమ్మకము కాలేదు. ఈ సెలయేరు వద్దకే వచ్చినది. తన పాదములను నీటియందు వదలి గట్టుపై కూర్చుండి ఆచనలో మునిగి పోయింది. ఎన్ని గంట లటుల గడిపిందో లెక్కలేదు. మాలలు విషయము మరచిపోయింది. వేడి నిట్టూర్పు విడుస్తూ యువకుని గృహమువైపు బయలుదేరింది. ఆ యువకుడామెను గుర్తించు నటుల లేదు. దగ్గరకువెళ్ళింది. మాలనొక దానిని అతని మెడలో వేసి అతని రెండుపాదములను ముద్దాడింది. ఆశ్చర్య పోయినాడు. కింకర్తవ్యతా మూఢుడై అటులనే నిలువబడి పోయినాడు. కొంతసేపటికి తెప్పరిలి "ఎవరు నీవు" అని విసుగుగా అడిగాడు. "ఎవరు నీవు" అన్న పదములు ఆమె హృదయకుహరమునందు ములుకులై నాటుకొని బేధింప సాగినవి. ఆమె మాటిమాటికి "ఎవరు నీవు" అన్న ప్రశ్నను తలంచుకొన్నది. కన్నీరు మున్నీరుగా కారుచున్నవి. అతని ముఖమువైపు దీనంగా చూసింది. యువకుడు, అతని భార్యయు తీక్ష్ణముగా చూస్తున్నారు ఆ మాలలన్నిటిని అచ్చటనే వదలి గిర్రునతిరిగి వెళ్ళిపోయింది.

"యువకుడు ఆలోచనానిమగ్నుడై కుర్చీలో వ్రాలిపోయినాడు. తన చిన్ననాటి స్నేహితురాలిని గుర్తించాడు. కుర్చీనుండి చివాలున లేచాడు. బయట జనము కోలాహలముగా పరుగెత్తుచున్నారు. యువకుడు వారివెంట బయలుదేరాడు ఏటినుండి బయటకు తీసిన శవాన్ని చూసాడు. అది ఆమె యే!!!

"ఆ రోజునుండి ఆమె జ్ఞాపకార్థముగా ఆమె విగ్రహాన్ని నిర్మించి ఆరాధన చేస్తున్నాడు." అనికథ పూర్తిచేసాడు. ఇంత లో ఇద్దరమూ యిల్లు జేరాము.